THE WORD OF TRUTH

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘములు సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

హిందీ — SATYA SUSAMACHAR

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 p. m.

ఆదివారము — 1-30 to 1-45 p. m.

ఇంగ్లీషు — THE VOICE OF TRUTH

ఆదివారము —9-30 to 9-45 p. m.

మంగళవారము — 9-30 to 9-45 p. m.

తమిళం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.

గురువారము — 6-45 to 7-00 p. m.

శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మళయాళం — THE VOICE OF TRUTH

మంగళవారము — 3-45 to 4-00 p. m.

శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**SATYA VANI**
P. O. Box 80, KAKINADA-533 001

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **9** ఏప్రిల్ **1982** సంపుటి **2**


## సంపాదకీయము

### నీకు తెలుసా?

*(Did you Know?)*

మనకు తెలియని సంగతులు అనేకము లున్నవి. ప్రభువు వాటిని మనకు బయలుపరచలేదు (ద్వితీ 29:29). మనకు తెలియని మరికొన్ని సంగతులుకూడ అనేకము లున్నవి. వాటిని మనము తెలిసికొనాలని ప్రయత్నము చేయుటలేదు. ప్రభువు తన చిత్తమును మనకు బయలుపరచినందున మనము ఆయన చిత్తము నెరిగి రక్షింపబడునట్లు దానికి లోబడవలెను గనుక దాని నెరుగకుండుట విచారకరము (యోహాను 8:32; హెబ్రీ 5:8, 9). అందువలన నీకు ఇంకా తెలియకపోతే నీతో కొన్ని సంగతులను పంచుకొనగోరుచున్నాను.

మానవుడు రక్షింపబడాలంటే సువార్తకు లోబడవలెనని నీకు తెలుసా? ఇది యథార్థము. ఎందుకంటే దేవుని నెరుగని వారికి, సువార్తకు లోబడనివారికి ప్రతిదండన చేయుటకు ప్రభువు మరల

రాభోవుచున్నాడని పౌలు చెప్పెను (2 థెస్స 1:7-9). "తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము వచ్చియున్నది; అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైనవారి గతి యేమవును ?" అని పేతురు చెప్పెను (1 పేతురు 4:17). అయితే ఒకడు సువార్తకు ఎట్లు విధేయుడగును ? సువార్త అనగా క్రీస్తు మరణ సమాధి పునరుత్థానముల వాస్తవములపై ఆధారపడియున్న శుభవార్త యని అర్థము (1 కొరింథీ 15:1-4). మనము వాస్తవములకు కాదు గాని ఆజ్ఞలకు లోబడగలము. గనుక మనము సువార్త ఆజ్ఞలకు లోబడవలెను. క్రీస్తు అపొస్తలులకు ఇట్లు చెప్పెను: "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). అందువలన రక్షింపబడవలెనంటే ఒకడు సువార్తకు లోబడవలెను. అట్లు చేయనివాడు నశించును.

బాప్తిస్మము రక్షించునని నీకు తెలుసా ? పేతురు ఇట్లనెను: "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసుక్రీస్తు పునరుత్థాన మూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షి నిచ్చు ప్రత్యుత్తరమే" (1 పేతురు 3:21). బాప్తిస్మము రక్షించునని అతడు చెప్పినను, బాప్తిస్మము ఒక్కటి మాత్రమే రక్షించునని అతడు చెప్పలేదు. బాప్తిస్మము ఎప్పుడు రక్షించును ? ఒకడు సత్యమును విని (రోమా 10:17), దానిని విశ్వసించి (యోహాను 20:30, 31), తన పాపముల విషయమై మారుమనస్సు పొంది (అపొ.కా. 17:30), క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని (మత్తయి 10:32), తన పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడది అతని రక్షించును (అపొ.కా. 2:38). ఒకడు ఈ క్షమాపణ షరతు లన్నిటికి విధేయత చూపేవరకు బాప్తిస్మము అతని రక్షించలేదు.

బాప్తిస్మము నీటిలో సమాధి యని నీకు తెలుసా? ఎఫెసీ 4:5 లో ఒకే ఒక్క బాప్తిస్మ మున్నదని మనము చదువగలము. కొలస్స 2:12 లోను, రోమా 6:3,4 లోను బాప్తిస్మము ఒక సమాధి యని మనము చదువగలము. దేనిలో సమాధి? అపొ.కా. 8:38,39 లో ఐతియోపీయ మనుష్యుని కొకనికి ఫిలిప్పు బాప్తిస్మ మిచ్చుట మనము చూడగలము. వారిద్దరు నీటిలోనికి దిగినట్లును, ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చినట్లును, తరువాత వారిద్దరు నీటిలో నుండి వెడలి వచ్చినట్లును వాక్యము చెప్పుచున్నది. బాప్తిస్మమునకున్న బాప్టిజో అను గ్రీకు పదమునకు ముంచుట లేక పాతిపెట్టుట యని అర్థము. బాప్తిస్మములో ఒకడు మారుమనస్సు పొందుటద్వారా తన పాపముల విషయమై మృతిజెంది, బాప్తిస్మపు నీటిలో సమాధి చేయబడి దాని నుండి తిరిగి లేచుటద్వారా ఒకడు ప్రభువు యొక్క మరణ సమాధి పునరుత్థానము లను సాదృశ్యముగా చిత్రీకరించును. రోమా 6వ అధ్యాయమును చదువండి.

ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మముద్వారా మాత్రమే ప్రవేశింప గలడని నీకు తెలుసా? ఒకడు క్రీస్తులోనికి ప్రవేశించుటకు బాప్తిస్మము పొందవలెనని రూఢిగా చెప్పు రెండు లేఖనములు మనకున్నవి. మొదటిగా రోమా 6:3 లో పౌలు ఇట్లనుచున్నాడు: "క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" రెండవది గలతీ 3:26,27 లో మనకు కనబడును. "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు". ఒకడు బహుశ విశ్వాసముద్వారాగాని లేక ఇంకోవిధముగాగాని క్రీస్తులోనికి ప్రవేశించ గలడా? మనము చదువుకొనిన ఈ లేఖనములను బట్టి ప్రవేశించలేడు. అంటే రక్షణ క్రీస్తులో యున్నది గనుక ఆయనలో లేనివాడు నశిం

చును అని దాని యర్థము (ఎఫెసీ 1:7). ఇంకా యేమంటే ఒకడు రక్షింప బడవలెనంటే అతడు క్రీస్తులో ప్రవేశించుటకు లేఖనానుసారమైన బాప్తిస్మము పొందవలెను.

ఒకే ఒక్క సంఘ మున్నదని నీకు తెలుసా? శరీరమొక్కటే యని (ఎఫెసీ 4:4), ఆ శరీరమే సంఘమని (కొలస్స 1:18), సంఘమే శరీరమని పౌలు చెప్పెను (ఎఫెసీ 1:22, 23). గనుక శరీరము ఒక్కటే అయితే, ఆ శరీరము సంఘమైతే, సంఘము ఒక్కటే. అది ఏ సంఘము? అది క్రీస్తు కట్టుదునని చెప్పినది (మత్తయి 16:18), దానికొరకు ఆయన చనిపోయినది (ఎఫెసీ 5:25), ఆయన దాని రక్షకుడైనట్టిది (ఎఫెసీ 5:23), దానికి ఆయన శిరస్సయినట్టిది (కొలస్స 1:18), అది ఆయన నామము ధరించునట్టిది (1 కొరింథీ 12:27; రోమా 16:16; అపొ.కా. 11:26). మిగతా సంఘము లన్నిటి సంగతి యేమిటి? అవి క్రీస్తుకు చెందవు. గనుక వాటిలో రక్షణ లేదు.

పరలోకమునకు వెళ్ళవలెనంటే, రక్షింపబడవలెనంటే ఒకడు క్రీస్తు సంఘసభ్యుడై యుండవలెనని నీకు తెలుసా? రక్షింపబడి దానిలో చేర్చబడినవారే సంఘము. గనుక రక్షించేది సంఘము కాదు (అపొ.కా. 2:47). గాని క్రీస్తే రక్షకుడు. ఆయన సంఘమునకు రక్షకుడు. "క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" అని పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీ 5:23). అయితే ఈ శరీరము ఏమిటి? అదే సంఘము (కొలస్స 1:18). అంటే క్రీస్తు సంఘమునకు రక్షకుడు గనుక రక్షింపబడాలంటే ఒకడు సంఘములో యుండవలెనని దాని యర్థము. ఇది యథార్థము గనుక సంఘమునకు వెలుపల యున్న వారు నశింతురని దాని యర్థము.

ఈ సంగతులలో కొన్నిటిని గూర్చి నీకు తెలిసియుండకపోవచ్చు. అనేకులకు యివి తెలియవనేది వాస్తవము. ఇవి నీకు తెలియజెప్ప

బడినను వాటిని నీవు అంగీకరించక పోవచ్చును. అయితే సత్యము సత్యమేయని జ్ఞాపక ముంచుకొనుము. సత్యాన్ని అంగీకరించుమని నేను నీకు విజ్ఞాపన చేయుచున్నాను. నీవు సత్యాన్ని విశ్వసించి దానికి లోబడిన యెడల ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చును గాని అంతకు ముందు కాదు.

---

## రక్షింపబడుటకు క్రీస్తు సంఘ సభ్యుడు కావలెనా ?

### *( Must one be a Member of the Church to be Saved? )*

—పెర్రీ కోతమ్

"రక్షింపబడుటకు ఒకడు సంఘసభ్యుడు కానవసరములేదు; సంఘము ఎవరిని రక్షించదు; ఒకడు ఏ సంఘసభ్యుడు కాకుండా క్రైస్తవుడుగా యుండగలడు" అనే సంగతులను మనము సాధారణముగా ఈ రోజులలో వినుచుందుము. ఈ సంగతులు సత్యమో కాదో మనము పరిశోధించుట మంచిది. బైబిలు ఈ లోకప్రియ సిద్ధాంతములను బోధించుచున్నదా? యను ప్రశ్నకు మనము జవాబును కనుగొనవలెను. జవాబు కనుగొనవలెనంటే లేఖనములను పరిశోధించుట అవసరము. అప్పుడు రక్షణను గూర్చి, సంఘ సభ్యత్వమును గూర్చి అవి ఏమి బోధించుచున్నవో ఒకడు తెలిసికొనగలడు.

### ప్రభువు ఎక్కడ రక్షించును ?

ప్రభువు రక్షించునని బైబిలు బోధించుచున్నట్లు అందరు అంగీకరింతురు. "మంచివారందరు సంఘము వెలుపల ఉన్నను లేక మరెక్కడ ఉన్నను రక్షించబడుదురు" అనే భావము కనబడుచున్నదా? ప్రశ్న ఏమంటే: ప్రభువు రక్షించున దెక్కడ? సంఘములోనా లేక సంఘము వెలుపలా? సంఘమునకు వెలుపల ఒకడు క్రైస్తవుడుగా

యుండగలడా? ప్రభువు సంఘమునకు వెలుపల ఒకడు రక్షింపబడగలడా? అయితే బైబిలు రక్షకుడెవరో యని బోధించుట మాత్రమే గాక ఆయన ఎప్పుడు ఎక్కడ రక్షించునో కూడ బోధించుచున్నందున ఈ ప్రశ్నకు బైబిలు జవాబిచ్చును. మానవుడు క్షమాపణ నొందుటకు షరతుల నిచ్చువాడు రక్షకుడే. మరియు రక్షణ నొందుటకు అతడు దేనిద్వారా ఏప్రదేశములో యుండవలెనో ఆయనే చెప్పును. క్రీస్తు ఎప్పుడు ఎక్కడ రక్షించునో చెప్పే హక్కును ఆయన కలిగి యున్నా డని అందరు అంగీకరింతురు. ప్రభువు అందరి రక్షణను కోరుచున్నాడు; అయితే మానవుడు దానిని పొందవలెనంటే దేవుడు దాని నెక్కడ ఉంచెనో ఆ ప్రదేశములోని కతడు ప్రవేశించవలెను. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలగుటకు నియమించ లేదు" (1 థెస్స 5:9; 2 పేతురు 3:9; 1 తిమో 2:4; తీతు 2:11).

రక్షణ విషయములో దేవుడు ఎల్లప్పుడు కొన్ని షరతులను, నియమములను ఉంచెను. వాటి ననుసరింపని వారందరు దానినుండి బహిష్కరింపబడిరి. ఉదాహరణకు: నోవహు దినములలో జలప్రళ యములో నాశనము కాకుండ దేవుడు మానవులకు రక్షణ నందించెను. గాని ఆ ఓడలో ప్రవేశించుటకు ఎవరయితే యిష్టపడిరో వారికే అది వర్తించెను. ఆ రక్షణను గూర్చి పేతురు ఇట్లు వ్రాసెను: "దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దిన ములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారి యొద్దకు ఆయన ఆత్మరూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిదిమంది నీటిద్వారా రక్షణ పొందిరి" (1 పేతురు 3:19-20).

ఈ వాక్య భాగము రక్షణ ఓడలో యుండెనని విపులీకరించు చున్నది. ఓడకు వెలుపల యున్నవారందరు నశించిరి. జల

ప్రళయము నుండి రక్షింపబడే స్థానము మరొకటి లేదు; గనుక ప్రజలు ఆ ఓడలో ప్రవేశింపని యెడల వారు నశించిరి. ఆ వృత్తాంతము చివర ఎనిమిదిమంది మాత్రమే రక్షింపబడినట్లు కనబడుచున్నది. వారు ఓడలోనికి, రక్షణలోనికి ప్రవేశించిరి. గాని మిగిలిన మానవ జాతి అంతయును దేవుని నియమములను పాటించుటలో విఫలులై రక్షణను ఆవరించుకొనియున్న ఓడలోనికి ప్రవేశించలేకపోయిరి. గనుక వారు నాశన మొందిరి. నోవహు దినములలో జలప్రళయమునుండి రక్షణను దేవుడు ఓడలో యుంచినందున, ఈ నాడు పాపమునుండి రక్షణను దేవుడు ఎక్కడ ఉంచెను? అనే ప్రశ్న తప్పక వచ్చును. దేవుడు రక్షణను తప్పక సంకల్పించెను మరియు బాధ్యతగలవారందరు రక్షింపబడవలెనంటే కొన్ని షరతులనుకూడ ఆయన విధించెను. ఈ నియమములకు వేరుగా ప్రజలు రక్షణను ఇంకొకచోట గాని, ఇంకొక విధముగా గాని పొందలేరు.

## రక్షణ క్రీస్తులో యున్నది

రక్షణ క్రీస్తులో యున్నదని, క్రీస్తుద్వారానే దేవుడు రక్షించునని బైబిలు బహు విపులముగా ప్రకటించుచున్నది. పౌలు ఇట్లనెను: "అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొనుచున్నాను" (2 తిమో. 2:10). అంతేగాక అపొ. పేతురు క్రీస్తును గూర్చి యిట్లు పలికెను: ఇల్లు కట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే; ఆ రాయి మూలకు తలరాయి ఆయెను. మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశముక్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:11-12).

క్రీస్తు యేసునందు రక్షణ పొందవచ్చునని అపొ. పౌలు చెప్పు

చున్నందున, మరింకొకచోట ప్రజలు రక్షణ పొందలేరా? యనే ప్రశ్నను మన మడుగవచ్చును. అయితే మరి ఎవని వలనను రక్షణ కలుగదు అని పేతురు ఖచ్చితముగా చెప్పుచున్నాడు. గనుక క్రీస్తు లోనే రక్షణ యున్నది గాని మరింకెక్కడా లేదని బైబిలు వక్కాణించు చున్నది. జలప్రళయమునుండి రక్షణను దేవుడు ఒక ఖచ్చితమైన ప్రదేశములో ఎట్లుంచెనో అట్లే పరిశుద్ధాత్మ ప్రేరితులైనవారు రక్షణను ఒక ఖచ్చితమైన ప్రదేశములో యుంచిరి. ఒకటి ఓడలో యుండెను, మరొకటి క్రీస్తులో యున్నది. ఈ నాడు రక్షణ మరొక చోట ఎక్కడ లభించదు; అది క్రీస్తు యేసులో మాత్రమే దొరుకును. గనుక రక్షింపబడుటకు అనేక మార్గములున్నవని భావించునప్పుడు మానవులు అపోహ పడుచున్నారు. పరలోకమునకు వెయ్యి మార్గ ములు లేవు. రెండుకూడా లేవు. యేసు ఒక్కడే ఆ మార్గము. ఆయన ఒక మార్గము కాదు. ఆయనే మార్గము.

"నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని యేసు ప్రకటించెను (యోహాను 14:6). రక్షణ క్రీస్తులోతప్ప వేరొకచోట ఎక్కడ లేనందున, మానవులు రక్షణను ఇంకెక్కడ పొందలేరు. గనుక రక్షణపొందే ప్రదేశము ఆయనలోనే యున్నది.

## క్రీస్తులోయుండుట అనగా సంఘములో ఉండుటయే

శరీరము ఒక్కటే యని ఆ శరీరమే సంఘమని బైబిలు వివరించు చున్నది: "మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22, 23). "సంఘము అను శరీరము నకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18). "సంఘము అను శరీరము కొరకు ......" (కొలస్స 1:24). గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే.

దేవునితో సమాధాన పరచబడుట అనగా పాపములు క్షమించ బడుట అని యర్థము గనుక, ప్రజలు సంఘములో రక్షించబడుదురు, క్షమించబడుదురు లేక సమాధాన పరచబడుదురు.

లేఖనముల నుండి ఈ దిగువ సంగతులు విశద మగుచున్నవి.

1) ప్రజలు ఒకే శరీరములో సమాధాన పరచబడుదురు (ఎఫెసీ 2:16). 2) ఆ శరీరము సంఘము (ఎఫెసీ 1:22, 23; కొలస్స 1:18,24). 3) గనుక ఆ ఒకే శరీరమైన సంఘములో ప్రజలు రక్షించబడుదురు లేక సమాధానపరచ బడుదురు.

సంఘమను శరీరమునకు రక్షకుడు క్రీస్తే యని బైబిలు బోధించు చున్నది: "క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు" (ఎఫెసీ 5:23). సంఘము క్రీస్తు శరీరమై యున్నందునను, మరియు క్రీస్తు శరీరమునకు రక్షకుడైనందునను ఒకడు రక్షింపబడి ఆయన సంఘములో సభ్యుడు కాకుండ యెట్లుండగలడు? రక్షింపబడవలె నంటే ఒకడు క్రీస్తు దేనికి రక్షకుడై యున్నాడో దానిలో సభ్యుడుగ యుండవలెను.

'సంఘము ఎవరిని రక్షించదు' అనే మాటలను మనము తరుచు వినుచుందుము. ఇది నిజమే. అయినను ప్రభువు సంఘమునకు వెలుపల యెవరైన రక్షింపబడునని ఇది నిరూపించుటలేదు. సంఘము యెవరిని రక్షించదనుమాట నిజమేగాని క్రీస్తు సంఘమును రక్షించును. గనుక ఎవరు క్రీస్తు శరీరములో యుందురో వారికే రక్షణ వాగ్దానము చేయబడినది. సంఘము రక్షకుడు కాదుగాని, అది రక్షింపబడినవారు. రక్షింపబడిన వారందరు సంఘములో యుందురు; లేక రక్షింపబడిన వారే సంఘము. "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అను దినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" అని బైబిలు చెప్పు చున్నది (అపొ.కా. 2:47). ప్రజలను ప్రభువు రక్షించి వారిని అదే

సమయమందు తన సంఘములో చేర్చెనని ఈ వచనము చెప్పుచున్నది. వారు మొదట రక్షించబడి తరువాత చేర్చబడలేదు లేక చేర్చబడి రక్షించబడలేదు. గాని వారు చేర్చబడుటలో రక్షింపబడిరి, రక్షింప బడుటలో చేర్చబడిరి.

మరొక సమీక్ష్యను గమనించుము:

1) రక్షణ క్రీస్తులో యున్నది గనుక, రక్షింపబడుట యనగా క్రీస్తులో నుండుట (2 తిమో 2:10).

2) రక్షింపబడుట, సంఘములో యుండుట సమానమే, ఏల యనగా రక్షింప బడుచున్న వారిని ప్రభువు సంఘముతో చేర్చును (అపొ.కా. 2:47).

3) గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే.

ఒకడు క్రీస్తులో యుండి ఆయన సంఘమునకు వెలుపల యుండ లేడు ఏలయనగా సంఘము క్రీస్తు శరీరమై యున్నది. ఒకడు రక్షింప బడవలెనంటే క్రీస్తులోనికి ప్రవేశించుట అవసరము, ఆయన సంఘ ములో యుండుట అవసరము. ప్రభువు యొక్క ఆత్మీయ శరీరమైన సంఘములో రక్షణ యున్నది. రక్షింపబడుచున్న వారినందరినీ సంఘ ముతో ప్రభువు చేర్చుచున్నందున క్రొత్త నిబంధన సంఘమునకు వెలుపల రక్షింపబడిన వారెవరును లేరు.

(సశేషము)

## రాజ్యము — సంఘము

యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతము వచ్చినపుడు మనుష్య కుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యుల నడిగెను. వారు-కొందరు బాప్తిస్మమిచ్చు యోహాను, మరికొందరు ఏలియా, కొందరు యిర్మీయా లేక ప్రవక్తలలో ఒకడు అని చెప్పుకొనుచున్నా

రనిరి. అందు కాయన మీరైతే నేనెవడననుకొనుచున్నారని అడుగగా, సీమోను పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. దేవునివలన బయలుపర్చబడిన ఈ సత్య మను బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు. ఈ సత్యమును నా తండ్రివలననే గ్రహించితివి గనుక నీవు ధన్యుడవు. పరలోక రాజ్యపు తాళపు చెవులు నీ కిచ్చెదను (మత్తయి 16:13-20) అని యేసు అతనితో చెప్పెను.

పరలోక రాజ్యము :- దేవుని రాజ్యము, పరలోక రాజ్యము అనునవి పర్యాయపదములుగా ఉండి ఒకే భావమును సూచించుచున్నవి (మత్తయి 11:11, లూకా 7:28). రాజ్యము అనునది గొప్ప బలముగల రాజ్యమును, పరిపాలనను సూచించుచున్నది. దేవుని రాజ్యము దేవునిచే పాలింపబడుచున్నది. పాతనిబంధన క్రిందనున్న ఇశ్రాయేలు రాజ్యముకూడా దేవునిరాజ్యమై యుండెను.

యేసు యూదా మత నాయకులతో ఇట్లనెను—"కాబట్టి దేవుని రాజ్యము మీ యొద్దనుండి తొలగింపబడి, దాని ఫలమిచ్చు జనుల కియ్యబడునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 21:43). ఈక్రొత్త రాజ్యమే క్రీస్తు ప్రభుని సంఘము (1 పేతురు 2:9-10). దానియేలు రోమా రాజ్యమును గూర్చి చెప్పుచూ పలికిన మాట ఏమంటే "ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు...అది యుగ యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44).

## పరలోక రాజ్యము సమీపించియుండెను

"పరలోక రాజ్యము సమీపించి యున్నది మారుమనస్సు పొందుడని" బాప్తిస్మమిచ్చు యోహాను బోధించెను..." (మత్తయి 3:1-2). బాప్తిస్మ మిచ్చు యోహాను చెరపెట్టబడిన తరువాత యేసు బోధించుట ప్రారంభించినపుడు "పరలోక రాజ్యము సమీపించి

యున్నది గనుక మారుమనస్సు పొందుడి అని చెప్పుచు..." (మత్తయి 4:17), చివరగా ఆయన అపొస్తలులను పంపుచూ "పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుడి" యని వారి కాజ్ఞాపించెను (మత్తయి 10:5-7). మరియు ఆయన డెబ్బదిమందిని పంపుచుకూడా అదే అంశమును ప్రకటింప నాజ్ఞాపించెను. "... దేవుని రాజ్యము మీ దగ్గరకు వచ్చి యున్నదని వారితో చెప్పుడి" (లూకా 10:1, 9).

**రాజ్యము యొక్క ఆరంభము :—** ఆయన "...ఇక్కడ నిలిచి యున్నవారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మార్కు 9 : 1). ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయన అపొస్తలులతో ఇట్లనెను: "మీరు పై నుండి శక్తిపొందువరకు పట్టణము (యెరూషలేము)లో నిలిచి యుండుడి" (లూకా 24 : 49, అపొ.కా. 1:)).

పెంతెకొస్తు దినమందు శక్తి వచ్చెను. అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి (అపొస్తులు 1:4-5, 2:1-4). పేతురు కీర్తన 16:8-11ను తీసుకొని యేసు దావీదు సింహాసనమందు కూర్చొని పరిపాలన ప్రారంభించెనని వివరించెను. "క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు. ఆయన శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలుసుకొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను ...... మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను" అని అతడు బోధించెను (అపొస్తులు 2:25-36).

అనేకులు హృదయంలో నొచ్చుకొని సహోదరులారా మేమేమి చేయుము ? అని యడిగిరి. పేతురు వారికిట్లు జవాబిచ్చెను : "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరము మీరు పొందుదురు" (అపొస్తులు 2:37-42). ఈబోధ వినినవారిలో

దాదాపు మూడువేలమంది బాప్తిస్మము పొందిరి. అపుడే దేవుని రాజ్యము, మన ప్రభువైన యేసుక్రీస్తు సంఘము భూలోకములో ప్రారంభ మాయెను.

ఇక్కడ గమనింపతగిన విషయం ఏమనగా ఆదినము మొదలు కొని "పరలోకరాజ్యము సమీపించి యున్నది" అని అపొస్తలులు ఎన్నడును బోధింపలేదు. అక్కడ నుండి వారి వివరణాపద్ధతి ఎట్లు న్నదనగా..."ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్స 1:13, హెబ్రీ 12:23, ప్రకటన 1:9).

**రాజ్యము యొక్క లక్షణము :–** మెస్సీయ రాజ్యముయొక్క నిజస్థితిని గూర్చి యూదు లనేకులు పూర్తిగా అపార్థము చేసుకొనిరి. వారికి ప్రథమ ప్రతాపముగల భూసంబంధమైన గొప్ప రాజ్యము తిరిగి కావలెననెడి కోరిక గలదు. ఈలాటి తప్పుడు భావముగల బాహ్య చూపు యేసు శిష్యులకుకూడా లేకపోలేదు. గనుకనే పరలోక రాజ్యములో ఎవడు గొప్పవాడని వారు యేసు నడిగిరి (మత్తయి 18:1–4). యాకోబు, యోహానులు రాజ్యమందు ముఖ్యస్థానములను ఆవశ్యముగా కోరుకొనిరి గదా! (మత్తయి 20 : 20–29, మార్కు 10:35-45). ఆయన పునరుత్థానుడైన తరువాతకూడా "ప్రభువా ఈ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని వారు అడిగిరి (అపొస్తలు 1:6).

అయితే ప్రభువు అది ఆత్మసంబంధమైన రాజ్యమని పొందికగా వివరించి చెప్పెను. పిలాతుతో ఆయన మాట్లాడిన సందర్భములో ఆయనబోధ ఇట్లుండెను. "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింప బడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు. నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను" (యోహాను 18:36).

నీకోదేముతో జరిగిన సంభాషణద్వారా దేవుని రాజ్యము యొక్క సహజలక్షణమును తేటగా వివరించి మన రక్షకుడు విశద పర్చెను. "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పు చున్నాను" (యోహాను 3:1-5). జాతీయత, వంశము, సాంఘిక సమ స్యలు, విద్య మొదలైనవి ఆత్మీయ రాజ్యమునకు పనికిరావు.

ఒకడు సువార్త నమ్మి మారుమనస్సు పొంది బాప్తిస్మమునకు లోబడినపుడు నూతన జన్మము పొందగలడు, అతడు దేవుని కుటుంబ ములో శిశువుగను, దేవుని రాజ్యములో పౌరుడుగను కాగలడు. తిరిగి జన్మించిన స్థితియందు సంఘములో ఉండును. ఇది ఆత్మీయమైన సభ్యత్వము.

రాజ్యము యొక్క విధి :— పేతురు క్రైస్తవులను ప్రోత్స హించుచు వారు పరిపూర్ణులగునట్లు విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశా నిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చు కొనుడి... "అందువలన సహోదరులారా, మీపిలుపును ఏర్పాటును నిశ్చయము చేసుకొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్ష కుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును అని హెచ్చరించెను (2 పేతురు 1:3-11). ఆ రాజ్యము ప్రాయముకలిగి రక్షించబడిన వారందరిని కలిగి యుండును (మత్తయి 8:11). దేవుని పిల్లలు ముందుగా తాము ఎరిగి యున్న క్రీస్తు రాకడకై ఎదురు చూచుచున్నారు. అప్పుడు వారు తమ పరలోక గృహములో ప్రవేశించెదరు. "గాని మన పౌరస్థితి పరలోక మందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని

నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము. సమస్తమును తనకు లోబరచు కొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానిగా మార్చును (ఫిలిప్పీ 3:20-21). "ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు..." "కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకని నొకడు ఆదరించుకొనుడి".

క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు ఈ భూలోకమందు రాజ్యమును స్థాపించి వేయి సంవత్సరములు భౌతిక రాజ్యపాలన చేయునన్నది నిరాధారమైన పచ్చి అబద్ధమే: క్రీస్తు స్పష్టముగా చెప్పెను: "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు" (యోహాను 18:36). ఆ రాజ్యము పొందినవారికే చెందుతుంది (దానియేలు 2:44). ఆ రాజ్యమును పొందువాడు అందు జన్మింపవలెను (యోహాను 3:5). దేవుని రాజ్యము క్రీస్తుసంఘం అనే పేరుతో దానిని పొందినవారికి మాత్రం చెందినదై యుండి అభివృద్ధి చెందుచున్నది. క్రీస్తు రెండవ సారి వచ్చినపుడు తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును. అప్పుడు అంతము వచ్చును (1 కొరింథీ 15:23-24). యూదులు క్రీస్తు ద్వారా భౌతికరాజ్యము స్థాపింపబడునని భ్రమచెంది విఫలులైనట్లే నేటి మతశాఖల వారంతా క్రీస్తు వెయ్యేళ్ళపాలన వస్తుందని భ్రమ చెంది నిష్ఫలులగుదురు.

—పాల్ సూటం, గొల్లపల్లి

---

## పాపమునకు దేవుని మందు

### (*God's Remedy for Sin*)

"దేవుని వెర్రితనము మనుష్యజ్ఞానము కంటె జ్ఞానము గలది,

దేవుని బలహీనత మనుష్యుల బలము కంటె బలమైనది" (1 కొరింథీ 1 : 25).

I పరిచయము :

A. "తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదు" (యిర్మీయా 10:23).

B. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామె 14:12).

C. "నా తలంపులు మీ తలంపులవంటివి కావు. మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు. ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికి పైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గములకంటె నా మార్గములు మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి" (యెషయా 55:8, 9).

D. మానవుని చిత్తమునకు అనుకూలముగను, లాజికల్‌గాను యుండే రక్షణమార్గాన్ని తాను వెదుకుకొనుటలో మానవుడు ఒక గొప్ప పొరబాటు చేయుచున్నాడు. క్రైస్తవ్యము లాజిక్ సంబంధమైనది గాక విశ్వాస సంబంధమైనది (2 కొరింథీ 5:7).

II ఈ సూత్రముయొక్క ఉదాహరణలు :

A. నయమాను ఒక కుష్ఠురోగి (2 రాజులు 5).

1. దేవుని ప్రమేయము వలన తప్ప శుద్ధి పరుపబడని రోగము కుష్ఠురోగము.

2. చెరగా కొనిపోబడిన చిన్నది నయమాను శుద్ధుడగునట్లు ఇశ్రాయేలులో యున్న ప్రవక్తదగ్గరకు అతడు వెళ్ళితే బాగుండునని చెప్పెను.

3. సిరియాదేశపురాజు ఇశ్రాయేలు రాజున కొక ఉత్తరము వ్రాసెను. నయమాను దానిని అతని యొద్దకు కొనిపోయెను.

4. ఆరాజు అతనికి సహాయము చేయలేకపోయెను. గాని నయమాను తనయొద్దకు రావలెనని దేవుని ప్రవక్త కబురు పంపెను.

5. "నీవు యొర్దానులో ఏడు మారులు మునిగి శుద్ధుడవు కమ్ము" అని ప్రవక్త నయమానుకు తెలియజేసెను.
6. నయమాను కోపము తెచ్చుకొనెను. అతడు మహా రౌద్రుడయ్యెను. అతని కియ్యబడిన మందు చాల తేలికగా యుండెను, అతనికి వెర్రితనముగా కనబడెను.
7. అయినను అతడు తన మనస్సు మార్చుకొని దేవుడు ఆజ్ఞాపించినట్లు చేసెను. శుద్ధుడయ్యెను.
8. ఆహా! ఎంత వెర్రిమందు! అతని బాగుచేసిన దేమిటి? అది యొర్దానునదిలో నీరా? కాదు, దేవుడే అతని బాగుచేసెను. ఇంకోలాగున దేవుడతని బాగుచేయలేడా? చేయగలడు గాని ఆయన చేయలేదు.

B. దేవుడు యెహోషువకు యెరికో నప్పగించెను (యెహోషువ 6).

1. అయితే యెహోషువయు అతని ప్రజలును యెరికో చుట్టూ రోజుకొక మారు చొప్పున ఆరు దినములు తిరుగవలెను. ఏడవదినమున ఏడుమారులు తిరుగవలెను. యాజకులు బూరల నూదవలెను, ప్రజలందరు ఆర్భాటముగా కేకలు వేయవలెను. అప్పుడు ఆ పట్టణ ప్రాకారములు కూలును. వారా పట్టణమును పట్టుకొనవలెను.
2. దేవుడు వారికి ఆ పట్టణము నప్పగించెను గాని వారు దానిని పొందకముందు వారు కొంతపని చేయవలసి యుండెను.
3. అందులో దేవునిపక్షమున కృపయు, యెహోషువ పక్షమున విశ్వాసము ఉండెను.
4. యెరికో గోడలను కూలగొట్టినదేమిటి? వారి ప్రదక్షిణములా? కాదు. యాజకుల బూరలా? కాదు. ప్రజల ఆర్భాటపు కేకలా? కాదు, దేవుడే ఆ గోడలు పడగొట్టెను. అయితే ఎప్పుడు? యెహోషువయు అతని ప్రజలును దేవుడు చెప్పినట్లు చేసినప్పుడు మాత్రమే గదా.

5. దేవుడా పనిని ఇంకోవిధముగా చేయలేడా? తప్పకుండా చేయ గలడు, గాని ఆయన తన ఆజ్ఞ నిచ్చినప్పుడు దానికి మనము లోబడవలసినదే.

C. ఇశ్రాయేలీయులు తాపకరములైన సర్పములచే కరువబడిరి (సంఖ్యా 21):

1. దేవుడు మోషేతో నీవు తాపకరమైన సర్పమువంటి ప్రతిమను చేయించి స్తంభముమీద పెట్టుము; అప్పుడు కరవబడిన ప్రతి వాడును దానివైపు చూచి బ్రదుకునని చెప్పెను.
2. వారి కాజ్ఞాపింపబడిన రీతిగా వారు చేసిరి. బ్రతికిరి.
3. విషసర్పముల కాటుకు ఇదేమి వెర్రి విరుగుడు! వారిని బాగు చేసిన దేమిటి? ఇత్తడి సర్పమా? కాదు. అది ఉంచబడిన స్తంభమా? కాదు.
4. దేవుడే వారిని బాగుచేసెను. దానిని ఇంకోవిధముగా ఆయన చేయలేడా? అవును గాని ఆయన చేయలేదు. దేవుని మాట మానవునికి వెర్రితనముగా తోచినను, దానికి అతడు లోబడ వలసినదే.
5. ఇశ్రాయేలీయులు దేవుని కృపవలనను వారి విశ్వాస విధేయతల వలనను బాగుచేయబడిరి.

D. క్రీస్తు ఒక గ్రుడ్డివానిని స్వస్థపరచెను (యోహాను 9).

1. ఆయన నేలమీద ఉమ్మి వేసి ఉమ్మితో బురదచేసి వానికన్నుల మీద పూసి నీవు సిలోయము కోనేటికి వెళ్ళి అందులో కడుగు కొనుమని చెప్పెను.
2. అతని కాజ్ఞాపింపబడిన రీతిగానే ఆ గ్రుడ్డివాడు చేయగా తన జీవితంలో మొట్టమొదటగా వెలుగును చూచెను.
3. ఆ గ్రుడ్డివానికి చూపు కలుగజేసిన దేమిటి? ఉమ్మా? కాదు. బురదా? కాదు. కోనేటిలోని నీరా? కాదు.

4. అది యేసుక్రీస్తులో బయలుపరచబడిన దేవుని శక్తి. అది దేవుని కృపతో మిళితమైయున్న విధేయతగల విశ్వాసము.

5. దీనిని లోకము వెర్రితనమని పిలుచును గాని "దేవుని వెర్రితనము మనుష్యజ్ఞానము కంటె జ్ఞానము గలది, దేవుని బలహీనత మనుష్యుల బలముకంటె బలమైనదని" జ్ఞాపకముంచుకొనుము.

## III రక్షింపబడుటకు షరతులేమిటి ?

A. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16).

B. ఎవడు రక్షింపబడును? కేవలము నమ్మువాడు మాత్రమేనా? కాదు. కేవలము బాప్తిస్మము పొందినవాడా? కాదు. అట్లయితే యెవడు? నమ్మి బాప్తిస్మము పొందినవాడు.

C. "నమ్మనివానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16). నమ్మనివానికి, బాప్తిస్మము పొందని వానికి శిక్ష విధించబడునని ప్రభువు ఎందుకు చెప్పలేదు? నమ్మనివానికి ఇంతకు ముందే శిక్ష విధించబడెను గనుక ఆయన అట్లు చెప్పనవుసరం లేదు (యోహాను 3:18).

D. మార్కు 16:16 లో రక్షింపబడవలెనంటే ఒకడు కనీసము రెండు సంగతులు చేయాలని ప్రభువు చెప్పెను. నమ్మి బాప్తిస్మము పొందవలెను. నమ్మనివానికి శిక్ష విధించబడును; అతడు బాప్తిస్మము పొందలేడు. నమ్మనివాడు బాప్తిస్మము పొందకపోతే కలిగే శిక్ష ఎక్కువ కానేరదు.

E. అవిశ్వాసి మారుమనస్సు పొందలేడు, క్రీస్తును ఒప్పుకోలేడు, బాప్తిస్మము పొందలేడు మరియు ప్రభురాత్రి భోజనంలో పాలు పొందలేడు. ఒకడు క్రైస్తవుడగుటకును, క్రైస్తవునిగా జీవించుటకును చేయు ప్రతి సంగతి విశ్వాసముతో చేయును.

F. మార్కు 16:16 నకు ఒక ఉదాహరణ :

1. "ఆహారము తిని జీర్ణింపజేసికొనిన వానికి ఆరోగ్యము కలుగును; గాని తిననివాడు మరణించును" అని చెప్పినపుడు 'జీర్ణింప చేసుకొననివాడు' అని చెప్పనవుసరంలేదు.

2. ఇది నిజమా, అబద్ధమా?

a) "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16)—నిజము.

b) నమ్మి బాప్తిస్మము పొందనివాడు రక్షింపబడును (మానవులు)—అబద్ధము.

మీకు సమీపములోయున్న క్రీస్తు సంఘూరాధనలకు హాజరవ్వండి!!

—W.A. బ్రాడ్‌ఫీల్డ్

---

# క్రీస్తును గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నది?

**A.** ఆదియందు దేవునితో క్రీస్తు ఉండెను అని అది బోధించుచున్నది: "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను" (యోహాను 1:1, 2).

**B.** మానవుని రక్షకునివలె క్రీస్తు వచ్చునని వాగ్దానము చేయబడెను అని అది బోధించుచున్నది: "మరియు నీకును స్త్రీకిని నీసంతానమునకును ఆమెసంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమెమీద కొట్టుదువు" (ఆది 3:15).

**C.** క్రీస్తు కన్యయైన మరియకు జన్మించెను. ప్రభువు జననమును గూర్చి ఇట్లు చెప్పబడెను:-"ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్తద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను.

ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము" (మత్తయి 1:22, 23).

D. యేసు దేవుని కుమారుడని బైబిలు బోధించుచున్నది: "అతడు ఇంకను మాటలాడుచుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; ఇదిగో ఈయన నాప్రియ కుమారుడు; ఈయనయందు నేనానందించుచున్నాను. ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములోనుండి పుట్టెను" (మత్తయి 17:5). "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు ప్రకటించెను (మత్తయి 16:16).

E. క్రీస్తు పాపములేనివాడుగ యుండెను: "ఎందుకనగా మన మాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథి 5:21).

F. క్రీస్తు రక్షించుటకు వచ్చెను: "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" (లూకా 19:10).

G. క్రీస్తు మనకొరకు చనిపోయెను: "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:8).

H. క్రీస్తు సమాధినుండి లేచెను: "ఇదియు గాక అపొస్తలులు బహు బలముగా ప్రభువైన యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్య మిచ్చిరి. దైవకృప అందరియందు అధికముగా ఉండెను" (అపొ.కా. 4:33).

I. క్రీస్తు పరమందున్న తండ్రియొద్దకు ఆరోహణుడాయెను: "ఆయన వెళ్ళుచుండగా వారు ఆకాశమువైపు తేరిచూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారి యొద్ద నిలచిరి" (అపొ.కా. 1:10).

J. క్రీస్తు మరల వచ్చునని బైబిలు బోధించుచున్నది: "మీ హృదయమును కలవర పడనియ్యకుడి, దేవునియందు విశ్వాసముంచు చున్నారు, నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రియింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్దనుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:1-3). ★

## యేసును వెంబడించిన పండ్రెండుగురు-1

## పేతురు: పరిచర్యచేయు నాయకుడు

## *(Peter: The Serving Leader)*

యేసు శిష్యులలో నాయకునివలె పేతురును మనమెరుగుదుము. క్రీస్తుతో సన్నిహిత సంబంధము కలిగినవారిలో కూడ పేతురు ప్రముఖుడుగా అగుపడుచున్నాడు (మార్కు 5:37; లూకా 5:2). శిష్యుల నందరినీ అడిగిన ప్రశ్నలకు పేతురు సమాధానమిచ్చేవాడు (మార్కు 8:29). శిష్యులందరు అడగాలనుకున్న ప్రశ్నలను అడిగేవాడు (మార్కు 10:23).

పేతురు నాయకత్వాన్ని మన ప్రభువు గుర్తించి, సువార్త పరిచర్యలో పేతురుకు ప్రత్యేక పనులనిచ్చి ఆయన అతని తలాంతులను వినియోగించెను (లూకా 22:8). ఆయన మరణించిన తరువాత తన అనుచరుల కాపరి కొట్టబడినందున వారు చెదరిపోదురని యేసు ఎరుగును (మార్కు 14:23). గాని తన మనసు తిరిగినతరువాత పేతురు తన సహోదరులను స్థిరపరచవలెనని ఆయన నిరీక్షించెను (లూకా 22:31).

యేసుచే మొదట పిలువబడిన శిష్యులలో పేతురు ఒకడైనను, తాను ప్రభువు పరిచర్యలో ప్రముఖ పాత్రను వహించుచుండిన వాడైనను, మానవులందరి నాయకుని వలె యేసు ఎట్లుగునో అను సంగతిని

అతడు పూర్తిగ గ్రహించుకోలేక పోయెను. ఫిలిప్పుదైన కైసరయలో యేసే క్రీస్తని అతడు ఒక గొప్ప సత్యమును ఒప్పుకొనినను యేసు హింసలు పొందనేరడని, ఉపేక్షింపబడడని అతడనుకొనెను (మార్కు 8:31-33).

ఇదివరకు యేసు పట్టుబడుట, విమర్శించబడుట చూచేసరికి పేతురు కృంగి నలిగిపోయెను. అతని సహజలక్షణములగు ఉత్సాహ నిరీక్షణలు మాయమైపోయెను. భూసంబంధమైన అతని నిరీక్షణలు విఫలమవ్వగానే తన ప్రభువు నెరుగనని అతడు బొంకెను. గాని తన ప్రభువు మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని సంతాపపడి యేడ్చెను (లూకా 22:62). యేసుతో కూడ యున్న కార్యక్రమము సమాప్తమాయెను. గొర్రెల కాపరి కొట్టబడెను, గొర్రెలు చెదరిపోయెను.

తరువాత పునరుత్థానుడైన ప్రభువు మొదట పేతురుకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను (1 కొరింథీ 15:5). ఆయన ప్రత్యక్షుడైనందున ఒక నూతన సహవాసము ఏర్పడెను. ఆయన తన శ్రమల యొక్కయు, మరణము యొక్కయు భావమును మరల వారికి వివరించెను. ఇప్పుడు వారాయనను గ్రహించుకోగలిగిరి (లూకా 24:44-47). పేతురు మరల విశ్వసించిన ఈ సమూహముయొక్క నాయకుడయ్యెను. క్రీస్తు మరణము యొక్క యథార్థ భావమును అతడు గ్రహించుకొన్నాడు గనుక తన నాయకత్వము యొక్క యథార్థ భావమును ఇప్పుడతడు గ్రహించుకొనెను.

యేసు శ్రమలలోని ప్రత్యేక అంతర్యమును పేతురు గ్రహించుకోగలిగెను. మానవుని పాపములను భరించుచు యేసు దేవుని సేవకుని వలె మరణించెను. మెస్సీయ వేషము వేసుకొనిన వాని వలెగాక ఆయన పరిశుద్ధ నీతిమంతునిగా మరణించెను. మరణములోను పునరుత్థానములోను ఆయన సేవకుడు, నాయకుడు అయ్యెను (అపో.కా. 5:31; 3:15; హెబ్రీ 2:10). ఈ మరణము ద్వారా మానవులందరికి ఆయన ఉపకారి అయెను. యేసు శ్రమలను భరించిన దేవుని సేవకుడనే ఈ అంతర్యభావము పేతురు చేసిన ప్రబోధములలో ప్రాముఖ్యాంశమాయెను (అపో.కా.3:13-15; 4:25; 1 పేతురు 2:21-24).

పేతురు బోధించినది తనకు వ్యక్తిగతముగా ముఖ్యమైనది.
పునరుత్థానుడైన ప్రభువు అతనికి ఒక గొప్ప ఆజ్ఞ యిచ్చెను. మరియు
అతడు తన మరణము ద్వారా దేవుని మహిమ పరచునని ఆయన ప్రవ
చించెను (యోహాను21:15-19). యేసుయొక్క వ్యక్తిగత పరిచర్యలో
నాయకత్వమును గూర్చి పేతురు గ్రహించుకొనలేక పోయినది ఇప్పుడు
గ్రహించుకొనెను: అదేమంటే నిజమైన నాయకత్వము పరిచర్యలో
వేరుపోసుకొని దానినుండి పెరుగును. మరియు అందరికంటె గొప్ప పరి
చారకుడైన యేసు నాయకులందరికి మాదిరియై యున్నాడు (1 పేతురు
5:1-4).

— అబ్రహామ్ J.M.

---

## అనుమానము యొక్క ప్రభావము

### *(The Force of Suspicion)*

"అనుమానించువాడు...దోషి యని తీర్పునొందును" (రోమా 14:23). అనుమానమను పదమునకు సందేహము, అపనమ్మకమని అర్థము చెప్పవచ్చును. అది తప్పులేని తావులయందు నేరములను ఆరోపించును.

నిర్దోషి నిర్భయముగను నిశ్చింతగను యుండును గాని భక్తి హీనుడు అనుమాన భయములతో తరుమబడుచుండును. అనుమానముతో కబళింపబడినవారు అవమానభరితులగుదురు. వారికి వారే అపకీర్తిని కొని తెచ్చుకొందురు. అట్టివారు పవిత్రత, నీతి, నిజాయితి గలవారిని సహితము అనుమానింతురు. "Suspicion haunts the guilty soul" యని షేక్స్పియరు చెప్పిన దానికి 'అనుమానమే పెను భూతము' అను తెనుగు సామెత సమానమైనది.

అనుమానమనునది నిజముగా అతి విచారకరమైన ఒక ఉన్మఖత. ఏలయనగా యది యథార్థమైన మైత్రి, ప్రేమ, వాత్సల్యము గల చోట్ల విషమువలె పనిచేయును. పరిపాలకులను నిరంకుశులుగను, యజమాను

(తరువాయి టైటిలు ఆఖరు పేజీలో)

# జీవజలం

జీవితేసు యేసుని జీవజలం ప్రవహిస్తోంది
సత్యవాక్కు (వాణి) స్వరూపాన ప్రవహిస్తోంది
బీడు వారిన హృదయ క్షేత్రాల్లో ప్రవహిస్తోంది
ముప్పది అరువది నూరంతలుగా ఫలిస్తోంది!

అనవసరపు ఆకలి దప్పుల నణిచేస్తుంది
అవసరపు ఆత్మీయాహారాన్ని అందిస్తుంది
అనిత్య జీవితంబాపి, నిత్యజీవిత మిస్తుంది
తన్ను గోరిలిన వారినెల్ల తరింపజేస్తుంది!

కఠిన హృదయాలను కరిగిస్తోంది
కరుణామయ హృదయాలను కలిగిస్తోంది
ఇహలోక వాంఛలను హతమారుస్తోంది
పరలోక వాంఛలను ప్రబోధిస్తోంది!

పాప రోగమును బాగు పరుస్తోంది
పశ్చాత్తాపమును ప్రసాదిస్తోంది
మలిన హృదయాన్ని మంచిగ మార్చేస్తోంది
ప్రభు సేవాపరాయణంలో పయనింప జేస్తోంది!

మతశాఖల తత్వతిమిరమును మార్చివేస్తోంది
కూర్మి సోదరత్వమును కుమ్మరిస్తోంది
విరిగి నలిగిన హృదయాన్ని వికసింప జేస్తోంది
మోక్ష మార్గమందు నడువంగ జేస్తోంది!

ప్రతినోట, ప్రతియింట, ప్రతి పేటలో
ప్రతి పల్లెలో, ప్రతి పట్టణంలో, ప్రతి దేశంలో
ప్రపంచమంతటా-ఇంకా, ఇంకా ప్రవహించాలి,
ప్రభు యేసుని పరిశుద్ధ వాక్యామృత జీవజలం!

—వల్తాటి జోసెఫ్

(24వ పేజీ తరువాయి)

లను క్రూరులుగను మార్చును. వైవాహిక జీవితమును నాశనము చేయును. ఈ విధముగా యిది ఆ యా రంగములలో బహు ఘోరమైన ఫలితములు రేకెత్తించును.

ఎవడైనను - దేవుని నమ్ముచున్నానని చెప్పి, తన సహోదరుని అనుమానించిన యెడల అతడు అబద్ధికుడగును. తనతో యున్న సహోదరుని నమ్మనివాడు తాను చూడని దేవుని విశ్వసింపలేడు. అనుమానించువాడు మరణమందు నిలిచియున్నాడు. ఎందువలనంటే, "విశ్వాసమూలము కానిది ఏదో అది పాపము" (రోమా 14:23). "నేను తొందరపడినవాడనై - ఏ మనుష్యుడును నమ్మదగినవాడు కాదనుకొంటిని" (కీర్త 11 : 11). గనుక "దురభిమాన పాపములలో పడకుండ నీ సేవకుని ఆపుము, వాటిని నన్ను ఏలనియ్యకుము. అప్పుడు నేను యథార్థవంతుడనై అధిక ద్రోహము చేయకుండ నిందారహితుడ నగుదును" (కీర్తనలు 19:13) యని దావీదు ప్రార్థించెను. దురభిమాన పాపములలో అనుమాన మొకటి. అందుచే మీ అనుమానమును బట్టి "జీవముగల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసము లేని దుష్టహృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి."

---

*From*
**SATYA WAKKU**
**P.O. Box 80**
**KAKINADA–533 001**

**Printed Book only**

**To**

..........................................

..........................................

..........................................

..........................................